క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పూజలందుకుంటున్న పైడితల్లి

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు ఆదివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగ్రహణం వీడిన తర్వాత వేకువజామున ఆలయ సంప్రోక్షణ చేశారు. అనంతరం 8 గంటల నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, అలాగే సోమవారం జరగనున్న తొలేళ్ల సంబరానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ కేఎల్ సుధారాణి తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక



1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని బీపీఎం మున్సిపల్ హైస్కూల్‌లో 1996 - 97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు జోగారావు, సత్యనారాయణ, సుబ్బారావు, రమేష్‌కుమార్, సూరికుమారి, శారదలను సన్మానించారు. కార్యక్రమంలో శంకర్, మోహన్, రవికాంత్, శ్రీను, కూర్మారావు, అప్పలరాజు, శ్రీదేవి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ దీపాలను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్



హైమాస్ట్ విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. విజయనగర ఉత్సవాలు, పైడితల్లి జాతరను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నగర పాలక సంస్థ అధికారులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే వివిధ జంక్షన్లలో ప్రత్యేక ఆకృతులతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను కోలగట్ల ప్రారంభించి పట్టణవాసులకు వెలుగులు పంచారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సురభి నాటక ప్రదర్శన



మాయాబజార్ నాటకంలో సన్నివేశం

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాల్లో భాగంగా ప్రఖ్యాత సురభి నాటక సమాజం ఆదివారం రాత్రి ప్రదర్శించిన మాయాబజార్ పౌరాణిక నాటక ప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. శ్రీ వినాయక నాట్యమండలి ఆధ్వర్యంలో బొంకులదిబ్బ వద్ద నిర్వహించిన ప్రదర్శనలో కళాకారులు తమ నటనా ప్రతిభతో పాటు, సినిమా తరహాలో దృశ్యాలను కళ్లకు కట్టినట్లు చూపారు. నాటక ప్రదర్శనను వేదిక ఇన్‌చార్జ్ పీఆర్ఎస్ఈ గుప్తా, డీపీఆర్ఓ దున్న రమేష్, డోల మన్మథకుమార్, భీశెట్టి బాబ్జీ, తదితర ప్రముఖులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాటక సమాజ నిర్వాహకుడు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాకు చెక్

విజయనగరం క్రైమ్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా 30న తొలేళ్లు, 31న సిరిమానోత్సవం పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలోనికి మత్తు పదార్థాలు రానీయకుండా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు ప్రత్యేక చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పట్టణంలోనికి మద్యం, సారా, గంజాయి, తదితర నిషేధిత సరుకులు రాకుండా వై జంక్షన్, అయ్యన్నపేట జంక్షన్, జేఎన్‌టీయూ జంక్షన్, జమ్ము జంక్షన్, సారిపల్లి జంక్షన్‌ల వద్ద చెక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వన్‌టౌన్, రూరల్ సీఐల ఆధ్వర్యంలో రెండు మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే 94413 69536 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సకల కళల సమాహారం..

- వెల్లివిరిసిన కళా రూపాలు, నృత్య ప్రదర్శనలు
- ఆద్యంతం ఆసక్తి గొలిపే విన్యాసాలు
- రక్తి కట్టించిన ఏకపాత్రాభినయాలు



కళాకారులకు నగదు అందజేస్తున్న నిర్వాహకులు



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఆనందగజపతి కళాక్షేత్రం ఆవరణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహం వద్ద నృత్యబృందం



గొల్లపల్లి సత్యారావు పులివేషధారులు

విజయనగరం టౌన్: విజయనగర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం విజయనగర ఉత్సవాలకు పెద్దపీట వేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అంగరంగ వైభవంగా ఉత్సవాల నిర్వహణ చేపట్టింది. ఎటుచూసినా కళారూపాలను ప్రదర్శిస్తూ కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. నాలుగు వైపులా సాంస్కృతిక కార్యక్రమాలతో విజయనగరం విరాజిల్లుతోంది. ఓ వైపు పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలు.. మరోవైపు విజయనగర వైభవం ఉట్టిపడేలా విజయనగర ఉత్సవాలతో విద్యలనగరం శోభాయమానంగా వెలుగుతోంది.

సంగీత సౌరభాలు విరాజిల్లిన ఆనందగజపతి కళాక్షేత్రం

కూచిపూడి, భరతనాట్యం, లలిత సంగీతం, వీణ, డోలు, నాదస్వరం, జానపద గీతాలు, శాస్త్రీయ నృత్యాలకు వేదికగా ఆనందగజపతి కళాక్షేత్రం అలరారింది. బి.సాయికృప, సాయి మానస బృందం శాస్త్రీయ సంగీతం.. సామవేదుల సత్యలత జానపదగీతాలు.. నర్తనశాల అకాడమీ డాక్టర్ భేరి రాధికారాణి నృత్యబృందం.. శ్రీ ప్రసన్న నృత్య కళానికేతన్ ఇబ్రహీమ్ ఖాన్ బృందం, సూర్యతేజ డ్యాన్స్ అకాడమీ ఎం.సౌభాగ్యలక్ష్మి బృందం, శ్రీ సూర్యా అకాడమీ టీవీ రామకశ్యప్ బృందం చేసిన సంప్రదాయ కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆహూతులను కట్టిపడేశాయి. మధ్యాహ్నం కె.పెంటయ్యనాయుడు బృందం ఆలపించిన భక్తిసంగీతం, జి.రాధాకుమారి బృందం లలిత సంగీతం, పి.తిరుపతి, శివకుమార్ జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. ఎస్.సంపత్ బృందం చేసిన శాస్త్రీయ సంగీతం.. వాసా సాయిజానకీ బృందం వీణాకచేరీ.. వెంపడాపు అప్పలస్వామి బృందం ఆలపించిన మృదంగ లయ విన్యాసం.. ఎన్.గోపాలరావు నాదస్వర లయవిన్యాసం ఆద్యంతం ఆనందింపజేశాయి. ఎ.శ్రీనివాసుల బృందం డోలు లయ విన్యాసం.. కె.విద్యాసాగర్ బృందం లలిత సంగీతం.. ఐ.మెహర్‌లత భక్తి సంగీతం.. చాగంటి రాజ్యలక్ష్మి బృందం శాస్త్రీయ సంగీతం.. సీహెచ్.రామచంద్రశేఖర్ బృందం ఆలపించిన భక్తి సంగీతం.. త్యాగరాజ సంగీత, నృత్య కళానికేతన్ ఎం.లక్ష్మీ రామదాసు బృందం శాస్త్రీయ సంగీతం చూపరులను కట్టిపడేశాయి. చివరిగా అమృతవర్షిణి టి.సౌమ్య బృందం చేసిన క్లాసికల్ డ్యాన్స్.. డాక్టర్ మండపాక రవి మృదంగ లయ విన్యాసం.. ఎం.బాలసరస్వతి వీణ కచేరి ఆహూతుల మన్ననలు పొందాయి. కార్యక్రమాలను జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి పర్యవేక్షించారు.

దుమ్మురేపిన జానపదకళాకారులు

స్థానిక లయన్స్ క్లబ్ వేదికగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జానపద కళాకారులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. గొల్లపల్లి సత్యారావు బృందం పులివేషాలు, కర్రసాము, కత్తిసాము ఆద్యంతం ఆహూతుల మన్ననలు పొందాయి. పూసపాటిరేగ సాయిగ్రూప్, విజయనగరం జాహ్నవి గ్రూప్, గజపతినగరం సంధ్య గ్రూప్ వేసిన జానపద నృత్యాలకు ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. తిరుపతి గ్రూప్ జానపద గీతాల ఫోక్ ఆర్కెస్ట్రా, రేలా రే రేలా.. జామి రామా గ్రూప్ తప్పెటగుళ్లు.. పాలకొండ సవర కమల గ్రూప్, వియ్యంపేట కె.ధనలక్ష్మి గ్రూప్ థింసా నృత్యం.. పాలకొండ సవర మాధవి గ్రూప్, కె.ధనలక్ష్మి గ్రూప్‌ల గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా మధ్యాహ్నం సీహెచ్ చిన్నరెడ్డి, ఎ.లక్ష్మనాయుడుల మహిళల కోలాటం, జముకుల కథ, నృత్యరూపకాలు, చెక్క భజనలు, శివభాగవతం అలరించాయి. కార్యక్రమాలను గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌వీకే దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.యశోధనరావు, సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

గురజాడ కళాభారతి వేదికగా 28 మంది కళాకారులతో నిర్వహించిన నాటిక ప్రదర్శనలు అలరించాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించిన నాటికల్లో విజయనగరానికి చెందిన నాటకశాల నటసేవా సమాజం నిర్వహించిన ఆఖరి ఉత్తరం ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంది. ఈపు అప్పలస్వామి స్మారక సాంస్కృతిక సేవా సమాజం నిర్వహించిన ఒక రాక్షసుడి కథ, దండుమారమ్మ ఆర్ట్స్ నిర్వహించిన రక్తసంబంధాలు నాటిక చూపరులను ఆలోచింపజేశాయి. అదేవిధంగా విజయలక్ష్మి బృందం చేసిన జననీ జయహే నాటిక, కణపాక శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన రాళ్లు - రత్నాలు నాటిక మంచి సందేశాలనిచ్చాయి. రౌతు అప్పలనాయుడు కల్చరల్ ట్రస్ట్ వారి కొండగాలి నాటిక అబ్బురపరిచింది.

అలరించిన అవధానాలు

కవులు తమ సాహితీ శంఖారావాన్ని పూరించారు. ఒకరికొకరు పోటీగా అవధాన ప్రక్రియలో పాల్గొని అందరినీ సంభ్రమాశ్చర్యానికి గురిచేశారు. శతాధిక కవి సమ్మేళనం నిర్వహణ బాధ్యతలను చివుకుల శ్రీలక్ష్మి, చీకటి దివాకర్ చేపట్టారు. లబ్ధప్రతిష్టులైన శతాధిక కవులు, కవయిత్రులు, పండితులు ఆలపించిన స్వీయ కవితాగానం, పద్యాలాపన చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన సాహిత్యగోష్ఠిని ఎన్‌కే.బాబు, డాక్టర్ జక్కు రామకృష్ణ పర్యవేక్షించారు. పద్య సాహిత్యంలో కొట్టు బాబురావు.. చరిత్ర, సాహిత్యంలో గార రంగనాథం.. ప్రవాస తెలుగు సాహిత్యంలో మంగిపూడి రాధిక.. ఆకాశవాణి సాహిత్య ప్రోత్సాహంలో బేతరామ సూర్యప్రకాశరావు.. ప్రచురణ రంగం ఇష్టాలు, కష్టాలను దుప్పల రవికుమార్.. సాహిత్య ప్రక్రియలు పాఠకాధారణను వి.వెంకటరావు.. జాషువా సాహిత్యాన్ని దేవరపల్లి రామయ్య.. సాహిత్యంలో గ్రామీణం డాక్టర్ అల్లి మోహనరావు.. జానపద సాహిత్యంలో బద్రి కూర్మారావు తమ ప్రతిభను చూపారు.

విజయనగరానికి ఉత్సవ శోభ

- కిటకిటలాడుతున్న విద్యలనగరం
- విద్యుత్ దీపాల ధగధగలు



కోట జంక్షన్ వద్ద ఉచిత మంచి నీటి సరఫరా కేంద్రం



ఆలయ పరిసర ప్రాంతంలో విద్యుత్ ధగధగలు

విజయనగరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి జాతర, విజయనగర ఉత్సవాలను పురస్కరించుకుని విద్యలనగరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతర, విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గతకంటే వైభవంగా విజయనగరం సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఘటాలు, పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వారితో సందడిగా మారాయి.

విద్యుత్ అలంకరణల ధగధగలు..

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి ఉత్సవాలు సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ యంత్రాంగం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దింది. అన్ని ప్రధాన జంక్షన్లు, ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో నగర శోభయమానంగా కళకళలాడుతోంది. అంతేకాకుండా నగరంలోని కోట, గంటస్తంభం, మూడులాంతర్ల జంక్షన్, మహాకవి గురజాడ అప్పారావు స్వగృహాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

హోటల్స్ ఫుల్..

పైడితల్లి సిరిమాను సంబరాన్ని తిలకించేందుకు వచ్చే భక్తజనంతో విజయనగరం జిల్లా కేంద్రం ఇప్పటికే రద్దీగా మారింది. సోమ, మంగళ వారాల్లో జరగనున్న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, సిరిమాను సంబరాలను వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన భక్తజనంతో పాటు పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. దీంతో నగరంలోని హోటళ్లన్నీ ఫుల్ అయ్యాయి.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు

సిరిమానోత్సవం సందర్భంగా పట్టణ ప్రజలకు ప్రతిరోజూ నీటి సరఫరా అందించే విధంగా కార్పొరేషన్ పాలకవర్గం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు సరఫరా చేసే సమయాల వివరాలను అధికారికంగా ప్రకటించింది. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడంలో భాగంగా 500 మంది అదనపు తాత్కాలిక సిబ్బందితో పనులు చేపట్టనున్నారు. విజయనగరం ఉత్సవాలు, జాతరను తిలకించేందుకు వచ్చే భక్తజనం కోసం ఉచిత తాగునీటి సరఫరా కేంద్రాలు, బయో టాయిలెట్‌లను ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

పైడితల్లికి జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు



పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

విజయనగరం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించున్నారు.

ఆలయ అధికారులు, అర్చకులు వేదమంత్రాలతో వీరికి స్వాగతం పలికారు. అమ్మవారికి జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులు, అల్లుడు ప్రదీప్‌నాయుడు, కుమార్తె సిరి సహస్ర, కుమారుడు సాయి మోహిత్ పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు వీరిని ఆశీర్వదించి ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న ప్రత్యేక వైద్య శిబిరం

- ఏటీ అగ్రహారంలో అదుపులోకి వచ్చిన డయేరియా కేసులు



పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆత్మారాముని అగ్రహారంలో డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయినందిని, సాయిరాం ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది ఆదివారం డయేరియా బారిన పడిన రోగులకు వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఇటీవల గ్రామంలో సుమారు 18 మంది డయేరియా బారిన పడ్డారని.. వారిలో ఇప్పటికే పది మంది ఆరోగ్యం కుదుటపడిందన్నారు. ఆరుగురు ప్రస్తుతం నెల్లిమర్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. గ్రామంలోని తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షలకు పంపించగా.. బాగున్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. కేసులు అదుపులోకి వచ్చినంత వరకు వైద్యశిబిరం కొనసాగిస్తామని వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు
- జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు



ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నూతన కార్యవర్గం

విజయనగరం రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ (అమరావతి) చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. విజయనగరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొప్పరాజు వెంకటేశ్వర్లు నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ అధ్యక్షుడిగా టి.గోవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.భానుమూర్తి, అసొసియేట్ చైర్మన్‌గా ఎ.విజయ్‌కుమార్, కోశాధికారిగా వి.సత్యనారాయణ, 8 మంది సహాయ అధ్యక్షులుగా, కార్యదర్శులుగా ఎంపికయ్యారు. అనంతరం జేఏసీ సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై 50 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. 30 పరిష్కారమయ్యాయన్నారు. నెల్లూరు జిల్లా కావలి ఆటోనగర్ ఆర్టీసీ డిపో డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి కమిటీ సెక్రటరీ జనరల్ పరిశెట్టి దామోదరరావు, అసొసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, రాష్ట్ర నాయకులు సమసాన శ్రీనివాసరావు, ఎస్.మల్లేశ్వరరావు, ఎ.సాంబశివరావు, ఆర్టీసీ ఈయు నాయకులు పెదమజ్జి సత్యనారాయణ, బి.రవికాంత్, వై.నాయుడు, జేఏసీ అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పుష్ప, ఫల ప్రదర్శన భళా..



వివిధ ఆకృతుల్లో అలరిస్తున్న పండ్లు, కూరగాయలు



పుష్ప జంతు ప్రదర్శన



ఆకట్టుకుంటున్న కాఫీ మగ్ విత్ కప్ ఆకృతి



పైడితల్లి సైకత శిల్పం



పూల సొగసులతో బార్బీడాల్

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతర సందర్భంగా ప్రజలకు మంచి విజ్ఞానం, ఆహ్లాదాన్ని అందించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పుష్ప, ఫల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆదివారం ప్రారంభమైన ప్రదర్శనను తిలకించేవారంతా మంత్రముగ్ధులై సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు. ఫ్రెష్ ఫ్లవర్స్, డ్రై ఫ్లవర్స్, వెజిటబుల్ కార్వింగ్‌లతో పైడితల్లి సైకతశిల్పం ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూల మొక్కలతో తయారు చేసిన భారతదేశం మ్యాప్, పూల పుట్టగొడుగులు, కాఫీమగ్ విత్ కప్, పూలతో చేసిన పలు రకాల పక్షులు, జంతువులు, బార్బీడాల్ ఆకృతులు, వాటర్ ఫౌంటెన్ పిల్లలు, పెద్దలను ఆకట్టుకున్నాయి.

ఆలోచింపజేసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల డ్రోన్ టెక్నాలజీ ప్రదర్శన



దెంకాడ అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల 'వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్'

విజయనగరం అర్బన్: విజయనగర ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం స్థానిక కోటలో ఏర్పాటు చేసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసింది. పలు పాఠశాల, కళాశాలల విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన ఇన్నోవేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ, సీతం కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంకేతిక పరికరాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. వ్యవసాయంలో పురుగు మందులు, ఎరువుల పిచికారీకి వినియోగించే మల్టీపర్పస్ డ్రోన్, ఎలక్ట్రిక్ ఆటో, ఎకో ఫ్రెండ్లీ ఎలక్ట్రికల్ సైకిల్, భారీ పరిశ్రమంలకు ఉపయోగించే పెడల్ ఫాన్స్, ఆటోమేటిక్ పార్కింగ్, బ్రేకింగ్ సెన్సార్ రోబోట్, రోబోటిక్ క్రేన్, ఫ్లాగ్ హోస్టింగ్ రోబోట్, తదితర పరికరాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.